# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 27-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతీయ ఐక్యతకు మహాకుంభమేళా నిదర్శనంగా నిలిచిందని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు.
- ❖ మహాకుంభమేళా కోసం 16 వేలకి పైగా రైళ్లు నడిపామని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.
- ❖ యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈ రోజు భారత్ కు చేరుకున్నారు.
- ❖ అభివృద్ధి చెందిన దేశాలకు సాంకేతికత ప్రతిభ చాలా అవసరమని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

==========================

భారతీయ ఐక్యతకు మహాకుంభమేళా నిదర్శనంగా నిలిచిందని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. మహాకుంభమేళా ఆలోచనలను ప్రధానమంత్రి తన బ్లాగ్‌లో పంచుకున్నారు. ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసిందని అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారని తెలిపారు. భారత్ నూతన శక్తితో ముందుకుసాగుతోందని, నవ భారత్‌ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనమన్నారు. త్రివేణి సంగమం నదీ తీరానికి కోట్ల సంఖ్యలో ఇంత మంది ఎలా వచ్చారని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోందన్నారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కనిపించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేనని చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలామంది కుంభమేళాకు రావడం ఆనందంగా ఉందని నరేంద్ర మోదీ ఆయన బ్లాగ్ లో రాసుకొచ్చారు. ఈ ఐక్యతా స్ఫూర్తిని మార్గదర్శక సూత్రంగా తీసుకొని దేశానికి సేవ చేయడానికి అందరూ కలిసి పని చేయాలని ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు.

==========================

మహాకుంభమేళా కోసం 16 వేలకి పైగా రైళ్లు నడిపామని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ప్రయాగ్‌రాజ్ రైల్వే స్టేషన్‌లో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... దాదాపు 4 కోట్ల 50 లక్షల మంది ప్రయాణికులు ఈ రైళ్ల సర్వీసులను వినియోగించుకున్నారని చెప్పారు. గత రెండున్నర సంవత్సరాలుగా భారతీయ

రైల్వే ఈ విస్తృత ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమై ఉందని... దాదాపు 5 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని తెలియజేశారు. మహాకుంభమేళా కోసం 21కి పైగా ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లను నిర్మించామని తెలిపారు. ప్రయాణీకుల సురక్షిత ప్రయాణమే అత్యంత ప్రాధాన్యతగా ఈ ఏర్పాట్లు చేశామని అశ్వినీ వైష్ణవ్ వివరిస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

=========================

యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈ రోజు భారత్ చేరుకున్నారు. ఆమెకు కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్ స్వాగతం పలికారు. అనంతరం యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తో సమావేశమయ్యారు. రేపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ప్రతినిధి స్థాయి చర్చలు జరపనున్నారు.

=========================

గుజరాత్‌లో పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ఐక్యతా విగ్రహాన్ని సందర్శించారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పుష్పగుచ్ఛాలు సమర్పించారు. అనంతరం అడవిలో సఫారీ చేసి ఏక్తా నగర్‌లోని వైవిధ్యభరితమైన వన్యప్రాణులను రాష్ట్రపతి అన్వేషించారు. ఏక్తా నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని సందర్శించి శిక్షణ పొందిన వారితో సంభాషించారు. ఈరోజు సాయంత్రం అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ 44వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పాల్గొన్నారు.

=========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నానాజీ దేశ్‌ముఖ్ అంత్యోదయ కలలను ఫలవంతం చేశారని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా అన్నారు. ఈ రోజు నానాజీ దేశ్‌ముఖ్ 15వ వార్షికోత్సవం సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ... నానాజీ దేశ్‌ముఖ్ భారతదేశ దార్శనికుడని అభివర్ణిస్తూ.. కేవలం ఒక దశాబ్దంలో 60 లక్షల మంది భారతీయ పౌరులకు గృహాలను నిర్మించారని పేర్కొన్నారు. వసుధైవ్ కుటుంబకం అనే సిద్ధాంతంతో దేశం ముందుకు సాగుతుండగా, ప్రపంచం ఇప్పుడు భారత్ వైపు చూస్తోందన్నారు.

=========================

పంచవ్యాప్తంగా ఉన్న అన్ని సవాళ్లను ఎదుర్కొని భారతదేశం వృద్ధిపయనంలో ముందుకు సాగుతోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, ప్రపంచ సరఫరా గొలుసులో అనేక సవాళ్లు ఎదరవుతున్నాయని అన్నారు. ప్రపంచ క్రమాన్ని అభివృద్ధి చెందిన దేశాలు నిర్ణయించవని ఆర్థిక మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. నూతన ప్రపంచ క్రమంలో వాణిజ్యం, సాంకేతికత కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాలకు సాంకేతికత ప్రతిభ కూడా అవసరమని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ....

(వాయిస్ 35 సెకన్లు)

విరామం

=========================

వేవ్స్ సదస్సు ముంబైలో మే 1 నుండి 4వ తేదీ వరకు జరగనుందని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఈరోజు బెంగళూరులో AVGC రంగానికి సంబంధించిన ఒక కార్యక్రమంలో సంజయ్ జాజు మాట్లాడుతూ.., వేవ్స్ సదస్సు ఒక ప్రత్యేక కార్యక్రమం అని కంటెంట్ సృష్టికర్తలు, సాంకేతిక నిపుణులకు

యానిమేషన్, గేమింగ్, విజువల్ ఎఫెక్ట్స్ కు సంబంధించి ఇది అనేక అవకాశాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకుని దేశంలో AVGC రంగాన్ని వృద్ధి మార్గంలో నడిపించాలని ఆయన కోరారు.

==========================

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ ఈరోజు ముంబైలో భారత్ కాలింగ్ కాన్ఫరెన్స్ 2025ను ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ... మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి ప్రభుత్వ వ్యూహాత్మక కార్యక్రమాలు ఆర్థిక పరివర్తనను మరింత ముందుకు తీసుకెళ్తున్నాయని అన్నారు. దేశంలో అపారమైన అవకాశాలు  పెరుగుతున్నాయని నైపుణ్యాభివృద్ధి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలను సృష్టిస్తుందని మంత్రి పియూష్ గోయల్ మాట్లాడుతూ...

(వాయిస్ 42 సెకన్లు)

==========================

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈరోజు ఉడాన్ యాత్రి కేఫ్‌ను ప్రారంభించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... దేశంలోని అన్ని విమానాశ్రయాలకు ఇటువంటి కేఫ్‌లను విస్తరిస్తామని తెలిపారు. తాగునీరు, టీ, కాఫీ, స్థానిక స్వీట్లను తక్కువ ధరలో విక్రయించడంతో ప్రయాణికులందరికీ ప్రయోజనం చేకూరుస్తుందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. చెన్నై విమానాశ్రయంలో మరో టెర్మినల్‌ను మార్చి 26న ప్రారంభిస్తామని ఆయన తెలియజేశారు.

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు సాధారణంగా ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74,602 లాభాల్లో ప్రారంభమై.. 74,559 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 2.50 పాయింట్లు నష్టపోయి 22,545 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.21గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 73.22 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2,901 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

==========================

ఐసిసి  ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్‌లో పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్లు ఈరోజు జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో గ్రూప్ ఏ లో  భారత్, న్యూజిలాండ్ జట్లు సెమీఫైనల్ కు చేరుకున్నాయి. అలాగే గ్రూప్ బీ లో తొలి రెండు స్థానాల కోసం ఆస్ట్రేలియా, దక్షిణ ఆఫ్రికా, ఆఫ్ఘనిస్థాన్ పోటీ పడుతున్నాయి.

==========================

మరాఠీ భాషా దినోత్సవాన్ని ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి 27న జరుపుకుంటారు. ప్రముఖ మరాఠీ కవి విష్ణువామన్ శివాడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తుంటారు. విష్ణువామన్ శివాడ్కర్‌ను ‘కుసుమాగ్రజ’ అని కూడా అంటారు. ఈ రోజున మరాఠీ సాహిత్యానికున్న గొప్పదనాన్ని గుర్తిస్తూ, మరాఠీ భాషా రచయితలను సన్మానిస్తుంటారు. మరాఠీ భాష ఆధునిక ఇండో - ఆర్యన్ భాషలలో అత్యంత పురాతనమైనదిగా గుర్తింపు పొందింది.

==========================
==========================